## క్లుప్తంగా

### వరసిద్ధునికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబీకులు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్య అన్నదాన ట్రస్టుకు ఓ దాత సోమవారం నగదు విరాళం చేశారు. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్‌కు చెందిన సురేందర్‌రెడ్డి రూ.లక్ష నగదును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాత కుటుంబీకులకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

### నవ సమాజ నిర్మాతలు గురువులు



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే

తవణంపల్లె: నవసమాజ నిర్మాతలు గురువులేనని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లె ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.మునస్వామి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక కల్యాణ మండపంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. మునస్వామిని ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే మనోహర్, డ్వామా పీడీ రవికుమార్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓలు రెడ్డిబాబు, వేణు, ఎంఈఓలు హేమలత, ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, ప్రసాద్, రుక్మిణి, నాగేశ్వరరావు, రాజేంద్ర, రుషేంద్ర, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయుల బృందం శాలువలు కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు.

### క్రికెట్ టోర్నీ విజేత చెన్నారెడ్డిపల్లె



చాంపియన్‌షిప్ అందుకున్న చెన్నారెడ్డిపల్లె జట్టు

యాదమరి: మండలంలోని కృష్ణంపల్లి పంచాయతీలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో చెన్నారెడ్డిపల్లె జట్టు విజయం సాధించింది. కొమ్మెపెల్లమ్మ వారికోత్సవంలో భాగంగా కార్తీక్ రెడ్డి నాయకత్వంలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. సోమవారం ఫైనల్ మ్యాచ్‌లో చిన్నిరెడ్డిపల్లె జట్టుపై చెన్నారెడ్డిపల్లె జట్టు గెలిచింది. విజేత చెన్నారెడ్డిపల్లి జట్టుకు రూ.8,888, రన్నర్ జట్టుకు రూ.4,444 నగదు బహుమతులుగా గ్రామపెద్దలు పద్మనాభరెడ్డి, నటరాజ రెడ్డి అందించారు.

ఎట్టకేలకు నాలుగేళ్ల తరువాత చిత్తూరు మార్కెట్ గేటు వసూళ్లు ప్రారంభం కానున్నాయి. పంటను స్వయంగా విక్రయించుకునే రైతులకు, చిరువ్యాపారులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ గేటు ఎత్తేశారు. ఉచితంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు. అయితే కూటమి సర్కారు ఈ రోజు నుంచి చిత్తూరు మార్కెట్ గేటు వసూళ్లకు శ్రీకారం చుడుతోంది. రైతులు పండించిన పంటను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రోడ్లమీద అమ్ముకుంటే కాస్త గిట్టుబాటు అవుతుందని రైతులు ఆశపడతారు. అయితే అలాంటి పేద రైతుల కడుపుకొట్టేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ గేటు వసూళ్లు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వసూళ్ల పర్వం మరో ఏడాదిలో ఎన్నెన్ని వివాదాలకు దారితీస్తుందో? ఎవర్ని బలి కోరుతుందోనన్న భయాందోళనలు రైతులను, చిరు వ్యాపారులను వెంటాడుతున్నాయి.

# ఇక వసూళ్లు



- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ గేటు ఎత్తేసిన వైనం
- వసూళ్లకే మొగ్గు చూపుతున్న కూటమి సర్కార్
- రుసుములపై బోర్డులు పెట్టని కార్పొరేషన్ యంత్రాంగం
- నేటి నుంచి చిత్తూరులో మార్కెట్ గేటు వసూళ్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంతో పాటు గుడిపాల, చిత్తూరు రూరల్ మండలం, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, తవణంపల్లె, యాదమరి, పెనుమూరు, కేజీ సత్రం, బంగారుపాళ్యం, ఐరాల, ఎస్ఆర్.పురం, వెదురుకుప్పంతో పాటు కర్ణాటకలోని కోలార్, ముళబాగిల్ తదితర ప్రాంతాల నుంచి రైతులు పండించిన పంటను తీసుకొచ్చి చిత్తూరు నగరంలోని మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఏ పంటనైనా అమ్ముకోవడానికి ఇక్కడ ఎలాంటి దళారీ ఉండరు. పంట పండించిన రైతు.. దాని ధరను నిర్ణయిస్తాడు. అయితే ఒక్కటే సమస్య. అదే మార్కెట్ గేటు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో తట్ట, బుట్ట, తోపుడుబళ్లపై వ్యాపారాలు చేసేవాళ్లు కార్పొరేషన్‌కు గేటు చెల్లించాలి. ఇలా చెల్లించిన గేటు నుంచి నగర అభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తుంటారు. ప్రతి ఏటా ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు గేటు వసూలు చేసుకోవడానికి కార్పొరేషన్ అధికారులు టెండర్లు పిలవడం, హెచ్చు మొత్తంలో వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్ గేటు వసూలు చేసుకుంటారు. కానీ ఇక్కడే ఓ తిరకాసు ఉంది.

**ఎవరు ఎంత చెల్లించాలి..?**

అక్రమ గేటు వసూళ్లను అరికట్టడంలో మునిసిపల్ కార్పొరేషన్, పోలీసు యంత్రాంగం కీలకపాత్ర పోషిస్తుంది. వ్యాపారాలు చేసేవాళ్లు గెజిట్ ప్రకారం ఎంత వసూలు చేయాలి..? ఏయే వ్యాపారాలు చేసేవాళ్లు రోజుకు కాంట్రాక్టర్‌కు ఎంత చెల్లించాలి..? అసలు గేటు కట్టాల్సిన అవసరంలేని వాళ్లు ఎవరు..? అనే వివరాలను కార్పొరేషన్ అధికారులు నగరంలో విస్తృతంగా ఫ్లెక్సీల ద్వారా తెలియచేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి..? ఎలాంటి చర్యలు తీసుకుంటారు..? అనే వివరాలు కూడా పొందుపరచాలి. గేటు చెల్లించని రైతులపై జరుగుతున్న దౌర్జన్యకాండ, గూండాగిరిని పోలీసులు అడ్డుకోవాలి. గొడవ జరిగిన తరువాత కేసు పెట్టడం కన్నా, కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. కానీ కార్పొరేషన్ అధికారులు, పోలీసు శాఖ మార్కెట్ గేటు వ్యవహారంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. మరో ఏడాదిలో ఈ గేట్ వసూళ్ల దందాలు, వివాదాలు ఎంతవరకు వెళతాయో?



## వివాదాల గేటు

మార్కెట్ గేటు ఎవరు ఎంత చెల్లించాలనేదానిపై జిల్లా కలెక్టర్ గెజిట్ జారీ చేస్తారు. పువ్వులు విక్రయించే వాళ్లు, చెరకు, పండ్లు, కూరగాయలు, పంటను తీసుకొచ్చే ఆటోలు, లారీలు... ఇలా ప్రతి ఒక్కరూ రోజుకు ఎంత చెల్లించాలో గెజిట్‌లో పొందుపరుస్తారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొబ్బరిబోండాలు అమ్మేవాళ్ల నుంచి రోజుకు రూ.20 వసూలు చేయాలనే నిబంధన ఉంటే.. రూ.50 వసూలు చేస్తారు. రూ.200 చెల్లించాల్సిన లారీ నుంచి రూ.3 వేలు ముక్కుపిండి వసూలు చేస్తారు. ఎవరైనా గేటు చెల్లించలేదంటే సరుకును నిర్దాక్షిణ్యంగా కాలితో తన్నడం, కొన్నిచోట్ల రైతులపై చేయిచేసుకోవడం లాంటి ఘటనలు చాలానే జరిగాయి. ఇదే టీడీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ గేటు వివాదంపై వచ్చిన విభేదాలు అప్పటి అధికార పార్టీ మేయర్, ఆమె భర్త ప్రాణాలను బలితీసుకుంది. ఇలాంటి వివాదాలు తలెత్తకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి మూడేళ్లకు పైగా టెండర్ డబ్బు స్వయంగా చెల్లించి, రైతుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా గేటు ఉచితం చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సైతం ఈ ఆనవాయితీను కొనసాగిస్తుందని భావించినా వసూళ్లకే మొగ్గు చూపింది

### నేడు గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### విశ్రాంత ఉద్యోగికి అంబేడ్కర్ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణన్

బంగారుపాళెం: మండలంలోని మహాసముద్రం గ్రామానికి చెందిన రిటైర్డు హెల్త్ ఆఫీసర్ కృష్ణన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉగాది పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం ఉగాది సందర్భంగా రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. దళితులకు అందించిన సేవలకు గుర్తింపుగా తనకు రాష్ట్ర అధ్యక్షులు చెన్నకేశవులు అవార్డు ప్రదానం చేసినట్లు ఆయన వివరించారు.

## రేపటి నుంచి మహా కుంభాభిషేక పూజలు





నూతనంగా నిర్మించిన షిరిడి సాయిబాబా ఆలయం, విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న ఆలయం

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీషిరిడి సాయిబాబా ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవాలు రేపటి నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ మహాకుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, గణపతిహోమం, నవగ్రహ హోమం, లక్ష్మీ హోమం, నవగ్రహ, ధనపూజ, గోపూజ జలాధివాసం, దాన్యాధివాసం, బింబశుద్ధి, పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు మృత్సంగ్రహణం, వాస్తుశాంతి, వాస్తుహోమం, అంకురార్పణం, ఆదివాస యాగ పూజ, పూర్ణాహుతి శయనాదివాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, సోమనాథపూజ, యాగపూజ, నారాయణహోమం, పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు యంత్ర స్థాపనం, రత్నంన్యాసం, విగ్రహప్రతిష్ఠ, బ్రహ్మ, విష్ణు, రుద్ర హోమం, తత్వహోమం, స్పర్శాహుతి, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4వ తేది శుక్రవారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ, అవబృద యాగ పూజ, యత్రాదానం, 9 గంటలకు ఉద్వాసనం, 9.30 గంటలకు శిఖర కుంభాభిషేకం, 9.45 గంటలకు శ్రీ షిరిడి సాయిబాబా కుంభాభిషేకం, అనంతరం భక్తులకు బాబా దర్శనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కుంభాభిషేకానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరు కానున్నారన్నారు.

## ఎమ్మెల్యే సత్య ప్రమాణం చేస్తారా?

- దాడి చేసినవారికి పోలీసుల వీడ్కోలు
- పరామర్శకు వెళితే కేసులు నమోదు
- వైఎస్సార్‌సీపీ మహిళా నేతల ఆవేదన



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు గాయత్రీదేవి, హరిణిరెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురళీరెడ్డిని ఎమ్మెల్యే దుర్భాషలాడలేదని కాణిపాకంలో సత్యప్రమాణం చేస్తారా అని ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి సవాల్ విసిరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. దాడిచేసిన వారి ఫొటోలు చూపించారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు మురళీని ఎమ్మెల్యే తిట్టారని ఆ విషయం దారి మళ్లించేందుకు అతనిపై దాడి చేయించారని ఆరోపించారు. ముకుమ్మడిగా 30 మంది ఇంట్లోకి చొరబడి కిటికీలు పగులగొట్టారని చెప్పారు. మురళీపై దాడి చేస్తున్నప్పుడు అడ్డు వచ్చిన అతని భార్య రేఖనూ కొట్టారని వివరించారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న వారి పిల్లలు రక్షణకోసం మంచం కింద దాక్కున్నారని పేర్కొన్నారు. బాధితులు పోలీసులకు సమాచారమిస్తే, రక్షణ కల్పించాల్సింది పోయి కొట్టడానికి వచ్చినవారిని సాగనంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అపార్ట్‌మెంట్‌లో ఉన్న కుటుంబాలు భయభ్రాంతులకు గురైనట్లు తెలిపారు. ఫిర్యాదు చేయడానికి రేఖతో పాటు పోలీసు స్టేషన్‌కు వెళితే వారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మురళీని పరామర్శించడానికి విజయానందరెడ్డితోపాటు నాయకులు వెళితే వారిపై కేసు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరులో ఏమి అభివృద్ధిచేశారో ఎమ్మెల్యేకే తెలియాలన్నారు. గతంలో ప్రారంభమైన బీసీ భవన్‌ను తిరిగి ప్రారంభించి గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

**కూటమి ప్రభుత్వం రౌడీయిజం**

పార్టీ మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రౌడీయిజంతో ప్రజలను భయపెడుతోందన్నారు. జగనన్న పాలనలో మహిళలకు ఉన్న భద్రత ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ఇంట్లోకి చొరబడి మురళీ భార్యను కొట్టారని, పోలీసులకు చెబితే పట్టించుకోలేదని చెప్పారు.

**ఆందోళన చేస్తాం**

అధికారపక్షానికి పోలీసులు కొమ్ముకాస్తున్నారని లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఇది కొనసాగితే విద్యావేత్తలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈవీఎంల మాయతో గెలిచిన ఎమ్మెల్యేకు ప్రజలు కష్టాలు తెలియవని నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలిరెడ్డి విమర్శించారు. మురళీ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు తప్పు అయితే టీడీపీ నాయకులు అసభ్యంగా చేస్తున్న పోస్టులపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు నౌషద్, హరీషారెడ్డి నవాజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు, తవణంపల్లె మండలాల్లో ప్రార్థనలకు హాజరైన చిన్నారులు







తవణంపల్లెలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చిత్తూరులో..



### ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురంలో వెలసిన ఎల్లమ్మతల్లికి సోమవారం గ్రామస్తులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు పొంగళ్లు, పూజా సామగ్రిని తీసుకుని పంబవాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం భక్తులు తీసుకొచ్చిన సుగంధ పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పిండిదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. నేడు పొంగుపాలు తీయడం, అమ్మవారికి పాలాభిషేకం, అమ్మవారి ఎదుట అగ్గితొక్కుట, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

# పేదలకు దానధర్మాలు చేయాలి

- ముస్లింలకు మతపెద్దల సందేశం
- భక్తి శ్రద్ధలతో రంజాన్
- ఈద్గాలో సామూహిక ప్రత్యేక ప్రార్థనలు
- ఉపవాస దీక్షల విరమణ





బంగారుపాళెం: ప్రార్థనలకు హాజరైన ముస్లింలు, తవణంపల్లె: సందేశం వినిపిస్తున్న మతపెద్ద

చిత్తూరు రూరల్(కాణిపాకం): ముస్లింలందరూ నీతి నిజాయితీగా సన్మార్గంలో నడవాలి. పేదలకు విరివిగా దానధర్మాలు చేయాలి అంటూ ఖురాన్ సందేశాన్ని మతపెద్దలు చదివి వినిపించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రార్థనా మందిరాల్లో ఈ ధార్మికోపన్యాసం చేశారు. చిత్తూరు నగరంలో సోమవారం ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మిట్టూరు, రామ్‌నగర్‌కాలనీ, గూల్సింగ్ పేట, ప్రశాంత్‌నగర్, బజారువీధి, సంతపేట., గంగనపల్లె తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనా మందిరాల వద్దకు మతపెద్దలు, ముస్లింలు తొలుత ర్యాలీగా వచ్చి ప్రత్యేక ప్రార్థనలను ప్రారంభించారు. ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహూరీ రంజాన్ మాస విశిష్టతపై ప్రసంగించారు. ముస్లింలు ఆచరించాల్సిన నియమ నిబంధనలపై వివరించారు. నగరంలోని ఈద్గాలో జరిగిన ప్రార్థనలకు ముస్లింలు భారీగా తరలిచ్చారు. వీరి రాకతో ప్రార్థన ప్రాంగణం మొత్తం నిండిపోయింది. ప్రాంగణం బయట వేసిన చలువ పందిరి దాటి రోడ్డు వరకు సందడిగా కనిపించింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

**మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు**

బంగారుపాళెం: దాన ధర్మాలకు ప్రతీకైన రంజాన్ సందర్భంగా ముస్లింలు బంగారుపాళెం, తగ్గువారిపల్లె, ఇందిరమ్మకాలనీ, మొగిలివెంకటగిరి మసీదుల వద్దకు చేరుకున్నారు. ఆయా మసీదుల వద్ద నుంచి ప్రదర్శనగా మొగిలివెంకటగిరి గ్రామ సమీపంలోని ప్రత్యేక ప్రార్థనా స్థలం(ఈద్గా) వద్దకు చేరుకున్నారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. గురువు రంజాన్ సందేశం ఇచ్చారు. పేదలకు దానధర్మాలు చేశారు.

**ఉపవాస దీక్షల విరమణ**

ఐరాల: రంజాన్ పురస్కరించుకుని ముస్లింలు నెల రోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షలను సోమవారం విరమించారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ముస్లింలు పండుగను సంతోషంగా జరుపుకున్నారు. ఉదయం స్థానిక జామీయా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు నుంచి మత పెద్దలు, ముస్లింలు వీఎస్. అగ్రహారంలోని ఈద్గా మైదానం వరకు ఊరేగింపుగా చేరుకున్నారు. మత పెద్దలు ధార్మికోపన్యాసం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**రంజాన్ వేడుకలు**

యాదమరి: మండలంలో సోమవారం ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని అత్యంత వైభవంగా జరుపుకున్నారు. స్థానిక ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్ద రంజాన్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. స్థానిక ఎస్ఐ ఈశ్వర్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

**పరమత సహనానికి ప్రతీక**

తవణంపల్లె: దానగుణానికి, పరమత సహనానికి, భక్తి భావానికి ప్రతీక రంజాన్. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అరగొండ, పాన్నేడుపల్లె, గాజులపల్లె గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకున్నారు. అరగొండ మసీదు నుంచి ఈద్గాకు ర్యాలీగా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మత గురువు ఖురాన్‌ను చదివి వివరించారు. నీతి, నిజాయితీగా బతకాలనీ, సన్మార్గంలో నడవాలని, తాము సంపాదించే నగదులో కొంత భాగాన్ని పేదలకు దానం చేయాలని సూచించారు. సమాధుల వద్దకు చేరుకొని పెద్దలను స్మరించుకున్నారు.



చిత్తూరు: నగరంలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



ఐరాల: రంజాన్ వేడుకల్లో ముస్లింలు



చిత్తూరు: రంజాన్ ప్రార్థనల్లో మత బోధనలు చేస్తున్న ప్రభుత్వ ఖాజీ

